క్లుప్తంగా

బీమా సొమ్ము అందజేత



మాచరలో మృతుని కుటుంబ సభ్యులకు బీమా సొమ్మును అందజేస్తున్న నాయకులు

కపిలేశ్వరపురం: మాచర గ్రామానికి చెందిన తాటికొండ శ్రీను (47) ఇటీవల అనారోగ్యంతో చనిపోయారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వైఎస్సార్ బీమా రూ.లక్ష బీమా మంజూరు చేయించారు. తొలి విడతగా రూ.10 వేలను శనివారం మృతుడు శ్రీను కుటుంబ సభ్యులకు వెల్ఫేర్ అసిస్టెంట్ ఖండవిల్లి వీరాంజనేయులు, వైఎస్సార్ సీపీ నాయకులు వాసంశెట్టి విష్ణుమూర్తి, పట్నాల వీరవెంకట సత్యనారాయణ చేతుల మీదుగా అందజేశారు.

మహిళలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న విజయదుర్గా సేవా సమితి సభ్యులు

రాయవరం: స్థానిక వెదురుపాక విజయదుర్గా సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు చీరలు, పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. సేవాసమితి ప్రతినిధులు బలిజేపల్లి రమ, గాదే సత్యవెంకట కామేశ్వరి, బి.రమ ఆధ్వర్యంలో 100 మంది పేదలు, వృద్ధులకు చీరలు, 10 మంది పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. విజయదుర్గా పీఠాధిపతి గాడ్ కుమార్తెలు ఏర్పాటు చేసిన సేవాసమితి ద్వారా ఏటా దసరా, సంక్రాంతి ఆగస్టు నెలల తమ సేవా సమితి తరుపున దుస్తులు పంపిణీ, అన్నదానం నిర్వహిస్తున్నట్టు సేవాసమితి ప్రతినిధులు తెలిపారు.

నేడు మంత్రి పర్యటన షెడ్యూల్

రామచంద్రపురం: నేటి ఉదయం 9.30 గంటలకు రామచంద్రపురం పట్టణంలో ఏరియా ఆసుపత్రిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పాల్గొంటారని మంత్రి అడిషనల్ పీఎస్ పి.తేజేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 గంటలకు రామచంద్రపురం మండలం కందులపాలెంలో, 10.30 గంటలకు కె.గంగవరం మండలం శివల గ్రామంలోను స్వచ్ఛత-మన బాధ్యత కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

ఘనంగా గంధోత్సవం

రామచంద్రపురం: పట్టణ శివారు వీఎస్ఎం కళాశాల వద్ద నెలకొని ఉన్న మహబూబ్ సుభాని దర్గా వద్ద ఆదివారం గంధోత్సవ కమిటీ ఆధ్వర్యంలో గంధోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత గంధపు బిందెతో నగరోత్సవం నిర్వహించారు, అనంతరం దర్గా వద్ద ప్రార్థనలు చేశారు. కమిటీ అధ్యక్షుడు షేక్ సుభాని ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్గా వద్ద దావత్ నిర్వహించారు.

నేడు కందులపాలెంలో స్వచ్ఛత మన బాధ్యత

రామచంద్రపురం రూరల్: మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మార్గ నిర్దేశకత్వంలో రామచంద్రపురం నియోజకవర్గంలో నిర్వహిస్తున్న స్వచ్ఛత-మన బాధ్యత కార్యక్రమం నేటి ఉదయం రామచంద్రపురం మండలంలోని కందులపాలెంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎస్.కీర్తిస్పందన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో మంత్రి వేణు పాల్గొంటారని మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొనాలని సూచించారు.

పేకాడుతున్న 11 మంది అరెస్టు

మండపేట: మండలంలోని మారేడుబాక శివార్లలోని ఓ రేకుల షెడ్డులో పేకాడుతున్న 11 మందిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. విశ్వసనీయంగా అందిన సమాచారంతో సీఐ కె.శ్రీధర్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ కె. అప్పారావు, సిబ్బంది దాడి చేశారు. పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్టుచేసి వారి వద్ద నుంచి రూ.9,900 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టెన్త్ విద్యార్థులకు పాఠ్యాంశాలపై వర్క్‌షాప్

రాయవరం: విద్యార్థులు శాస్త్రవేత్తలుగా తయారు కావడానికి, శాస్త్ర పరిశీలన పెంచుకునేందుకు ప్రయోగ పూర్వక వర్క్‌షాప్‌లు ఎంతో ఉపయోగపడతాయని రేవతి సైన్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు కె.శ్రీకృష్ణసాయి పేర్కొన్నారు.మండలంలోని మాచవరం శివాలయం వద్ద గల శ్రీ భావన ఋషి కల్యాణ మండపంలో ఆదివారం స్థానిక యువత టెన్త్ విద్యార్థులకు పాఠ్యాంశాలపై వర్క్‌షాపు నిర్వహించారు. కార్యక్రమంలో పదవ తరగతి భౌతిక రసాయన శాస్త్ర విభాగానికి సంబంధించిన ఉష్ణం, ఆమ్లాలు క్షారాలు, కాంతి వక్రీభవనం, పరమాణు నిర్మాణం ఆవర్తన పట్టిక, రసాయన బంధం మొదలగు పాఠ్యాంశాలకు సంబంధించి పలు ప్రయోగాలను విద్యార్థులకు వివరించారు. సోమేశ్వరం, మాచవరం, పులగుర్తకు చెందిన సుమారు 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నల్లమిల్లి వెంకటరెడ్డి, కె.గణపతి, ఏ.దుర్గా ప్రసాద్, టి.హేమ వెంకట దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

స్వచ్ఛత పల్లెవించేలా..

- గ్రామీణ ప్రాంతాల్లో ముమ్మరంగా కార్యక్రమాలు
- సత్ఫలితాలిస్తున్న స్వచ్ఛత మన బాధ్యత

కె.గంగవరం: ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా నియోజకవర్గంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి సూచనల మేరకు గత ఐదు రోజులుగా రామచంద్రపురం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్న స్వచ్ఛత మన బాధ్యత కార్యక్రమం సత్ఫలితాలనిస్తుంది. ముఖ్యంగా రహదారులు, సందుల్లో, కుండీల వద్ద ఎక్కడా కూడా చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల్లో ప్రతి రోజు నిర్వహించే పారిశుద్ధ్య కార్యక్రమాలకు అదనంగా ఒక్కో గ్రామంలో రెండు రోజులు పాటు ప్రజాప్రతినిధులు, ప్రజలు సంయుక్తంగా స్వచ్ఛత మన బాధ్యత కార్యక్రమంలో పాల్గొంటున్నారు. మంత్రి చెల్లుబోయిన వేణు ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో మండల స్థాయి ఎంపీడీఓలు, తహసీల్దార్లు, పంచాయతీ కార్యదర్శులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. స్వచ్ఛత మనందరి బాధ్యత కార్యక్రమం ఉన్న గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఉదయం 8 గంటలకే పంచాయితీలకు చేరుకుంటున్నారు.

అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు..

పల్లెల్లో అపరిశుభ్రత వాతావరణం నెలకొనకుండా ప్రజలు ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వ ఆదేశాల మేరకు పలు కార్యక్రమాలు చేపట్టారు. అయితే ప్రస్తుతం ముఖ్యంగా వీధులు, డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం, రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తను తొలగించడం, చెత్త మొక్కలను తొలగించడం, తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయడం, నీటిలో క్లోరినేషన్ చేయడం వంటి చర్యలు చేపట్టారు. ఇప్పటికే పల్లెలో ఎలాంటి అంటురోగాలు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈఓపీఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శులకు జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. దీంతో వారు పల్లెలో అవగాహన కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించారు.



తామరపల్లిల్లో స్వచ్ఛత మన బాధ్యతపై అవగాహన కల్పిస్తున్న ప్రజాప్రతినిధులు

చెత్తను షెడ్లకు తరలిస్తూ..

గ్రామీణ ప్రాంతాల్లోని వీధుల్లో, డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు సాలీడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్లకు తరలిచేందుకు గ్రామ పంచాయతీ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టారు. ముఖ్యంగా పారిశుద్ధ్య పనుల్లో నిమగ్నమైన క్లాప్ మిత్ర, షెడ్‌మిత్రలకు ఆయా గ్రామ పంచాయతీల్లోని నిధుల లభ్యతను అనుసరించి వేతనాలు ఇవ్వాలని ఆదేశాలు జారీ అయ్యాయి. మేజర్ గ్రామ పంచాయతీల్లో ట్రాక్టర్లు, ట్రాక్టర్లు లేని ప్రాంతాల్లో ఆటోల ద్వారా చెత్తను ఎత్తివేస్తూ వీధులను శుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తున్నారు.



కూళ్లలో రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్తను తొలగిస్తున్న దృశ్యం

గొయ్యి తవ్వి చెత్త వేసి..

స్వచ్ఛత మన బాధ్యతలో ముఖ్య ఉద్దేశంగా మొదటి రోజు ఊరిలో ఉన్న చెత్తను మొత్తం పోగేసి, ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి ఒకచోట భద్రపరుస్తున్నారు. రెండో రోజు ఆయా పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తూ ప్రజాప్రతినిధులు, పంచాయతీ పారిశుధ్య కార్మికులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ర్యాలీ నిర్వహిస్తున్నారు. అనంతరం ఆ గ్రామాల్లో ముందుగా తీసిన గొయ్యిలో వ్యర్థాలను వేసి పాతిపెడుతున్నారు. ఇలా నెలలో రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించాలని పంచాయితీ కార్యదర్శులకు మండల స్థాయి అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

> **ప్రజల్లో మార్పు వస్తుంది**
>
> స్వచ్ఛత మన బాధ్యత కార్యక్రమం ద్వారా ప్రజల్లో పారిశుధ్యంపై సరైన అవగాహన కలిగింది. ప్రజల్లో మార్పు రావడంతో పాటు ఇంట్లో వ్యర్థాలను పెరట్లో గొయ్యి తీయడంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలను భద్రపరిచి పారిశుధ్య కార్మికులకు అందిస్తున్నారు. క్రమక్రమంగా గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం మరింత మెరుగవుతుంది.
>
> – ఎస్.శ్రీనివాసరావు, ఎంపీడీఓ, కె.గంగవరం

బాధ్యతతో విధులు నిర్వర్తించాలి



వలంటీర్‌కు ఉత్తర్వులు అందిస్తున్న మంత్రి వేణు

కె.గంగవరం: ప్రభుత్వం ఆదేశించిన పనులను వలంటీర్లు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ అన్నారు. రామచంద్రపురం పట్టణంలో వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం సుందరపల్లి, కుందూరు గ్రామాల్లో నూతనంగా జాయిన్ అయిన వలంటీర్లకు నియామక ఉత్తర్వులు అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి వలంటీర్ తమకు కేటాయించిన 50 కుటుంబాల లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. పింఛన్ల పంపిణీలో అలసత్వం వహించకుండా బాధ్యతగా విధులు నిర్వహించాలని కోరారు. ఎంపీటీసీ పిల్లి దుర్గాప్రసాద్, సుందరపల్లి కన్వీనర్ రెడ్డి జయరాజు, ఉప సర్పంచ్ ఆర్.వర్మ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గొల్లపుంతకాలనీలో అన్నసమారాధన

మండపేట: శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక 20వ వార్డు గొల్లపుంత కాలనీలోని కల్యాణ మండపం వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం భారీ ఎత్తున అన్నసమారాధన జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత చైర్‌పర్సన్ దుర్గారాణి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కౌన్సిలర్ శెట్టి కల్యాణి, ఏఎంసీ డైరెక్టర్ షేక్ మస్తాన్, పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- కేశవరం మెరక వీధిలో గడప గడపకూ..

మండపేట: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కోరారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన మండలంలోని కేశవరం గ్రామంలోని మెరక వీధిలో పర్యటించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, దూలం వెంకన్నబాబు, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, సర్పంచ్ పెదపాటి సత్యనారాయణ తదితరులతో కలిసి గ్రామంలోని మెరక వీధిలో పర్యటించారు. నాలుగున్నరేళ్ల జగన్ పాలనలో ఆయా కుటుంబాల వారికి చేకూరిన లబ్ధిని వివరించారు. స్థానికులు తన దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలపై ఎంపీడీఓ ఐరాజు, ఈఓ సుబ్బారావుతో ఎమ్మెల్సీ తోట మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ తోట మీడియాతో మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వంలో లేని విధంగా సీఎం జగన్ ప్రజల వద్దకే పథకాలను చేరవేస్తూ పారదర్శకమైన పాలన సాగిస్తున్నారన్నారు. టీడీపీ పాలనలో పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. సీఎం జగన్ వచ్చాక ఎటువంటి అవినీతికి తావు లేకుండా వలంటీర్లు తలుపు తట్టి ప్రభుత్వ పథకాలను అందజేస్తున్నారన్నారు. ఆర్‌బీకే మండల కమిటీ చైర్మన్ అన్నందేవుల చంద్రరావు, ఎంపీటీసీ సభ్యులు అన్నందేవుల కృష్ణారావు, చంద్రమళ్ల పోతురాజు, సొసైటీ చైర్మన్ ముక్కపాటి శ్రీనివాస్, తులా శేషారావు, పెదపాటి ఉమామహేశ్వరావు, పార్టీ నాయకులు కుడిపూడి రాంబాబు, కొప్పిరెడ్డి ప్రసాద్, మన్నే నారాయణమూర్తి, పలివెల సుధాకర్, తుపాకుల ప్రసన్నకుమార్, మాచిరెడ్డి సురేష్, పెదపాటి శివయ్య, గంధం సూరిబాబు, అల్లంపల్లి కిషోర్, గనిశెట్టి సత్తిబాబు పాల్గొన్నారు.



కేశవరం మెరక వీధి వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం

రామచంద్రపురం: సమాజ సేవలో ఫోర్త్ ఎస్టేట్‌గా ఉంటూ ప్రజాసేవలో నిమగ్నమైన జర్నలిస్టుల చిరకాల కోరికైన ఇళ్ల స్థలాల మంజూరుకు నిర్ణయం తీసుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని రామచంద్రపురం ప్రెస్ క్లబ్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు తెలిపారు. జర్నలిస్టులకు 3 సెంట్ల స్థలం ఇవ్వడానికి మంత్రి ఆమోదం తెలపడంపై ఆదివారం మంత్రి వేణును ఆయన క్యాంపు కార్యాలయంలో రామచంద్రపురం ప్రెస్‌క్లబ్ ప్రింట్ మీడియా అధ్యక్షుడు కాటే భీమశంకరం, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు కనికెళ్ల కనకరత్నంల నేతృత్వంలో కలసి కృతజ్ఞతలు తెలియజేశారు. మంత్రి వేణు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి తన పాదయాత్ర సమయంలో జర్నలిస్టుల సమస్యలను గుర్తించి వారికి ఇంటి స్థలం ఇవ్వాలని ఆనాడు ఆలోచన చేశారన్నారు. నేడు ఆ నిర్ణయాన్ని అమలు చేశారన్నారు. జర్నలిస్టులకు ఇంటి స్థలం ఇచ్చే నిర్ణయంలో కీలక భూమిక పోషించిన మంత్రి వేణుకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు శాలువాలు కప్పి చిరు సత్కారం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రెస్ క్లబ్ కార్యదర్శి, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ మెంబర్ నరాల రాధాకృష్ణ, జర్నలిస్టులు చెల్లుబోయిన శ్రీనివాసు, బొమ్మా ప్రభాకర్, నరాల త్రిమూర్తులు, ఎలక్ట్రానిక్ మీడియా ఉపాధ్యక్షుడు కుడుపూడి రమేష్, కార్యదర్శి గంపల పృథ్వీరాజ్, రామచంద్రపురం మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సీహెచ్ దేవానందం, కార్యదర్శి బోడపాటి ప్రసాద్, గుబ్బల రాంబాబు, ర్యాలి శ్రీనివాస్, యనమదల శ్రీనివాస్, టి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి వేణును సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న రామచంద్రపురం ప్రెస్‌క్లబ్ సభ్యులు

వైజాగ్ వెళ్లి దివ్యాంగులకు పింఛను అందజేత



వైజాగ్ ఆసుపత్రిలో లోకేష్‌కు పింఛను అందజేస్తున్న దుర్గారావు, నరేష్



వైజాగ్ ఆసుపత్రిలో శ్రీనివాస్‌కు పింఛను అందజేస్తున్న దుర్గారావు, నరేష్

కపిలేశ్వరపురం: మండలంలోని కాలేరు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ అంకిరెడ్డి దుర్గారావు, వలంటీర్ కాళ్ల నరేష్ శనివారం వైజాగ్‌లో చికిత్స పొందుతున్న ఇద్దరు దివ్యాంగులకు పింఛన్లు అందజేసి తమ విధుల్లో మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ గ్రామానికి చెందిన పలివెల లోకేష్, గ్రామ శివారు అచ్యుతాపురానికి చెందిన కర్రి శ్రీనివాస్‌లు తమ కాళ్ళ వైకల్యాన్ని సరిచేసుకునే నిమిత్తం వైజాగ్ ప్రభుత్వ ప్రత్యేక ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు చేయించుకున్నారు. వారిద్దరికి వెల్ఫేర్ అసిస్టెంట్, వలంటీర్లు సుమారు 200 కిలోమీటర్లు ప్రయాణించి రూ.3వేల చొప్పున పింఛను సొమ్మును అందజేశారు. దివ్యాంగులకు సహాయకులుగా ఆసుపత్రిలో ఉన్న వారి వృద్ధాప్య పింఛన్లను సైతం పంపిణీ చేశారు. వారిని ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, సచివాలయ కార్యదర్శి దేవీ ప్రసన్న, వైఎస్సార్ సీపీ కాలేరు గ్రామశాఖ అధ్యక్షుడు ఏలేటి గంగరాజు, వడ్లమూరు ఎంపీటీసీ పలివెల మధు, నాయకులు అభినందించారు.

వైఎస్సార్ ఆశయ సాధనకు సీఎం జగన్ కృషి

కాజులూరు: రాష్ట్రంలో దివంగత నేత వైఎస్సార్ ఆశయ సాధనకు అనుగుణంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి పని చేస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని కుయ్యేరులో రూ.కోటి 63 లక్షలతో, అయితపూడిలో రూ.43.40 లక్షలతో, తిప్పరాజుపాలెంలో రూ.77.40 లక్షలతో, చేదువాడలో రూ.40.20 లక్షలతో నిర్మించనున్న 40 కేఎల్ సామర్థ్యం కలిగిన రక్షిత మంచినీటి ట్యాంకుల నిర్మాణాలకు మంత్రి శంకుస్థాపనలు చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 2006లో అప్పటి సీఎం వైఎస్సార్ గొల్లపాలెంలో సీపీడబ్ల్యూ స్కీమ్ ద్వారా జిల్లా పరిషత్ మంచినీటి చెరువులను భారీ రక్షిత మంచినీటి పథకంగా మార్చి కరప, కాజులూరు మండలాల్లోని 24 గ్రామాలకు తాగునీటి సరఫరా అందించారన్నారు. మహానేత మరణానంతరం అధికారంలోకి వచ్చిన పాలకులు ప్రజాసమస్యలను విస్మరించడంతో మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఏర్పడ్డాయన్నారు. గత నాలుగేళ్లుగా ప్రజాసమస్యలను పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు పరిష్కారాలు చేపడుతున్న సీఎం జగనన్న మండల గ్రామాల్లోని తాగునీటి సమస్య పరిష్కారానికి శాశ్వత చర్యలు చేపట్టారని ఆర్ఎస్ఎఫ్ సిస్టం ద్వారా శుద్ధి చేసిన జలాలను ప్రజలకు అందించనున్నారన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ.27.33 కోట్లతో మండలంలో 30 ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నిర్మాణాలు పూర్తయ్యాయని త్వరలో మండల గ్రామాల్లోని ప్రతీ ఇంటికీ పైపులైను ద్వారా సురక్షిత తాగునీటి సరఫరా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాత భారతి, జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, మండల పార్టీ అధ్యక్షుడు గుబ్బల ఏసురాజు, వైస్ ఎంపీపీ పెదిరెడ్డి వెంకటరమణ, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుత్తుల బుల్లిరాజు తదితరులు పాల్గొన్నారు.



తిప్పరాజుపాలెంలో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి వేణు

రోజూ రోడ్డు తడపాల్సిందే..

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం-ద్రాక్షారామ ప్రధాన రహదారి సీసీ రోడ్డు నిర్మాణం కోసం జేసీబీతో తవ్వడంతో రోజూ వాహనాల రాకపోకల సమయంలో దుమ్ము లేచి అటు ప్రయాణికులతో పాటు రోడ్డు పక్క ఇళ్ల వారూ నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య ఎంత తీవ్రంగా ఉందంటే ఇళ్లు, వాహనాలపై రోజూ పడుతున్న దుమ్ముతో వాటి స్వరూపాలు మారిపోతున్నాయి. దీనితో స్థానికులు ఈ బాధ నుంచి ఎంతో కొంత ఉపశమనం కోసం రోజూ రోడ్డును నీటితో తడుపుకుంటున్నారు. రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ డీఈ వివరణ కోరగా మండపేట మండలం ద్వారపూడి నుంచి రామచంద్రపురం మండలం వేగాయమ్మపేట వరకు ఒకరే కాంట్రాక్టర్ అని ద్వారపూడిలో రోడ్డు నిర్మాణం పూర్తి కావొస్తుందని వెంటనే ఇక్కడి రోడ్డు నిర్మాణం ప్రారంభిస్తారన్నారు.



ద్రాక్షారామ ప్రధాన రహదారిని తడుపుకొంటున్న గ్రామస్తుడు

కొత్త ఓట్ల నమోదుకు 1016 దరఖాస్తులు

రామచంద్రపురం రూరల్: ఈ నెల 4, 5 తేదీల్లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు నిర్వహించిన ప్రత్యేక శిబిరాల్లో రామచంద్రపురం నియోజకవర్గవ్యాప్తంగా కొత్త ఓట్ల నమోదుకు 1016 మంది దరఖాస్తు చేసుకున్నట్లు రామచంద్రపురం డివిజన్ ఆర్డీఓ, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎస్.సుధాసాగర్ ఆదివారం విలేకరులకు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా 239 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్-2024లో భాగంగా కొత్త ఓటర్ల నమోదు, మరణించిన ఓట్ల తొలగింపు, శాశ్వత గ్రామాంతరం వెళ్లిన వారి ఓట్ల తొలగింపు, ఓటర్ల నమోదులో సవరణ (పేరు, డోర్ నెంబరు మొదలైనవి), డూప్లికేట్ ఓట్ల తొలగింపులకు సంబంధించి నిర్వహించిన ప్రత్యేక శిబిరాలను ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాలను స్వయంగా పరిశీలించి బీఎల్ఓలకు ఫారమ్ 6, 7, 8 ల నమోదు విషయంలో ముఖ్యమైన సూచనలు చేయడం జరిగిందన్నారు. 4వ తేదీన కొత్త ఓట్ల నమోదుకు 380, తొలగింపులకు 100, సవరణలకు 120 దరఖాస్తులు రాగా, 5న కొత్త ఓట్ల నమోదుకు 636, తొలగింపులకు 163, సవరణలకు 310 దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు.

మళ్లీ జగన్ వస్తేనే జనరంజక పాలన

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- కేశవరంలో 'ఏపీకి జగనే ఎందుకు సీఎం కావాలి' కార్యక్రమం

మండపేట: ప్రజారంజక పాలన కోసం వచ్చే ఎన్నికల్లో మరలా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆదరించి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కేశవరంలో ఏర్పాటు చేసిన ఏపీకి జగనే ఎందుకు సీఎం కావాలి కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట పాల్గొని ప్రసంగించారు. కేశవరం గ్రామాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంచారని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కోట్లాది రూపాయలు వెచ్చించి గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. గత ఎన్నికల ముందు కుర్రా వారి మెట్టలో ఇళ్ల స్థలాలు ఇస్తున్నట్టు స్లిప్పులు అందజేసి పేదలను మభ్య పెట్టారని మండిపడ్డారు. ఆ మెట్టను లే అవుట్‌గా లెవెల్ చేసి జనవరి నాటికి పేదలకు ఇళ్ల స్థలాలు స్వాధీనం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మట్టా వారి సెంటర్‌లో ఎన్నో ఏళ్లుగా పాకలు నిర్మించుకుని నివసిస్తున్న వారికి త్వరలో పట్టాలు అందజేస్తామన్నారు. పార్టీ రాష్ట్ర నేతలు కర్రి పాపారాయుడు, రెడ్డి రాజుబాబు, దూలం వెంకన్నబాబు, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, ఎంపీపీ శ్రీనివాస్, పార్టీ నేతలు వుండమట్ల పెదకాపు, వుండమట్ల తాతాజీ, ఓగిరాల దేవి, కుడిపూడి రాంబాబు, పాలంగి కమల తదితరులు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి సీఎం జగన్, మండపేట నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఎనలేని సేవలు అందిస్తున్నారన్నారు. మండపేట డంపింగ్‌యార్డ్, ద్వారపూడి రోడ్డు, పుంత రోడ్ల అభివృద్ధి తదితర నియోజకవర్గాన్ని ఎన్నో ఏళ్లుగా పట్టి పీడిస్తున్న అనేక సమస్యలకు ఎమ్మెల్సీ తోట పరిష్కరించి ప్రతిపక్ష పార్టీలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారన్నారు. సర్పంచ్ పెదపాటి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ కేశవరం గ్రామాభివృద్ధితో పాటు మూడు దశాబ్దాల కాలంగా ద్వారపూడి, జెడ్ మేడపాడు, కేశవరం రైతాంగాన్ని పట్టిపీడిస్తున్న పుంత రోడ్లను అభివృద్ధి చేసిన ఘనత ఎమ్మెల్సీ తోటకు దక్కుతుందన్నారు. గ్రామాభివృద్ధికి కృషిచేస్తున్న ఎమ్మెల్సీ తోటను ఎంపీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ సంఘాల వారు ఘనంగా సత్కరించారు. సొసైటీ చైర్మన్ ముక్కపాటి శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు అన్నందేవుల కృష్ణారావు, పార్టీ నాయకులు కొప్పిరెడ్డి ప్రసాద్, సంగిశెట్టి సత్తిబాబు, వుండమట్ల నారాయుడు, అల్లంపల్లి కిషోర్, కూసు అబ్బు, మాచిరెడ్డి సురేష్, గంధం సూరిబాబు, సమతం పాపారావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు